# పాతికేళ్ళనాటి ప్రవాసాంధ్రులు

వేమూరి వేంకటేశ్వరరావు

'పాతికేళ్ళ ప్రవాసాంధ్రులు' అన్న అంశం మీద ఏదైనా రాసి 'తానా' స్వర్ణోత్సవ జ్ఞాపికలో ప్రచురణార్థం పంపించమని ప్రభాకరరావుగారు పట్టు పట్టి పదే పదే అడుగుతూ ఉంటే పోనీలే ప్రయత్నించి చూద్దాం అనిపించింది. అమెరికాలో ప్రవాసాంధ్రుల కథ పాతికేళ్ళ కంటె పాతది కనుక ఉదంతాన్ని మధ్యలో మొదలెట్టాల్సి వస్తుంది.

నాకిప్పటికీ కళ్ళకి కట్టినట్లు జ్ఞాపకం ఉంది. పాతికేళ్ళ కిందట మొట్టమొదటి తెలుగు సభ (అప్పటికి 'తానా' నామకరణం జరగలేదు) న్యూయార్క్ నగరంలో జరగబోయే తరుణంలో, "న్యూయార్క్‌లో తెలుగువాళ్ళు ఏదో సమావేశం అవుతున్నారుట, మేం వెళుతున్నాం. మీరు కూడా వస్తారా? మాకారులో చోటుంది తీసుకెళతాం" అంటూ బలుసు సుబ్బారావు అన్నారు. నాకు లోపల్లోపల వెళ్ళాలని ఉన్నా, మన వాళ్ళ సంగతి తెలుసు కాబట్టి, తీరామోసి అక్కడకి వెళ్ళిన తర్వాత 'యూ హౌమచ్ అంటే యూ హౌమచ్' (నువ్వెంతంటే నువ్వెంత) అనుకుంటూ కొట్టేసుకుంటారో ఏమోనని భయపడి వెళ్ళడానికి తటపటాయించేను. చివరికి అలసత్వం వల్ల వెళ్ళనేలేదు. నన్ను పిలచినాయన తిరిగి వచ్చి "పెద్ద పార్టీలా ఉందనుకోండి" అని ఒక సమీక్ష పారేసేరు. "రెండేళ్ళల్లో మరొక సమావేశం డిట్రాయిట్‌లో పెడతారుట" అంటూ ఒక వార్త అందించేరు.

నేను అమెరికా వచ్చిన కొత్త రోజులకి మొదటి తానా సభ నాటికి నాలోను, ఈ దేశంలోనూ ఎన్నో మార్పులు వచ్చేయి. పార్వతీశానికి అలనాడు లండన్ ఎలా కనిపించిందో 1961లో నాకు అమెరికా అలా కనిపించింది. తునిలో గిరిమల్లయ్య బిగుతుగా కుట్టిన సూటు జేబులో ఎనిమిది డాలర్లు, ఒక చేతిలో మెడ్రాసులో తీయించుకున్న ఎక్స్‌రే పటం, మరొక చేతిలో టంగ్ క్లీనర్లు వగైరాలు సర్దుకున్న తోలు పెట్టెతో న్యూయార్క్ ఐడిల్‌వైల్డ్ ఎయిర్‌పోర్ట్‌లో వాలేను కదా. అప్పటికే అమెరికాలో ఉంటున్న అన్నయ్య నన్ను దింపుకుందుకని న్యూయార్క్ వచ్చేడు. ఇద్దరం కలసి వై.యమ్.సి.ఎ. కి వెళ్ళేసరికి రాత్రి పది అయిందేమో అ దీపాల వెలుతురులో ఆ హొటేలు ధగధగ మెరిసి పోయిందనుకోండి. రెండ్రోజుల ముందు నేను బొంబాయిలో ఉండి వచ్చిన వెల్‌కమ్ హొటేలు దీని ముందు దిగదుడుపే. తర్వాత అన్నయ్య చెప్పేడు, నాకోసమని 'డీలక్స్' గది తీసుకున్నాట్ట; రోజుకి, మనిషి ఒక్కంటికి నాలుగు డాలర్లు అద్దె కట్టేనని చెప్పేడు. గత స్మృతులని జ్ఞాపకం చేసుకుందామనే తాపత్రయం మానవ నైజం అనుకుంటాను. ఆ వై.యమ్.సి.ఎ. ని వెతుక్కుంటూ 1980 లలో మళ్ళా వెళ్ళేను. వాళ్ళు తిరిగి డబ్బులిస్తానన్నా ఇప్పుడు అక్కడ ఉండలేను. తానే మారెనో, గుణంబే మారెనో అనుకుంటూ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ గబగబ వెనక్కి వచ్చేసేను.

మర్నాడు నేను లేచేసరికి అన్నయ్య కాలకృత్యాలన్నీ తీర్చేసుకుని, స్నానం చేసేసి తయారుగా ఉన్నాడు. ఒకటికీ, రెంటికీ కానిచ్చి మూటికి ఎక్కడకి వెళ్ళాలో తెలియక అన్నయ్యని అడిగేను. వాడు స్నానాల గది చూపించి "త్వరగా తెమిలి రా, మనం ఇక్కడ నుండి బయలుదేరాలి" అని తొందర పెట్టేడు. నేను స్నానాల గదిలోకి వెళ్ళి వెంటనే తిరిగి వచ్చేసేను. "అదేమిరా, అప్పుడే స్నానం అయిపోయిందా?" అని కొంచెం

ఆశ్చర్యపడిపోయి, అసలు సంగతి గ్రహించేసి, "మరేం పరవా లేదు. ఇక్కడ ఆచారమే అంత. నీకంతకి మొహమాటంగా ఉంటే నువ్వు తువ్వాలు కట్టుకుని స్నానం చేసెయ్" అంటూ నన్ను స్నానాల గదిలోకి తోసేడు. కళ్ళు మూసేసుకుని, తుండుగుడ్డ నడ్డికి చుట్టుకుని లోపలికి వెళ్ళేను. చచ్చిపోయాననే అనుకున్నాను. మొత్తంమీద స్నానం అయిందనిపించిన తర్వాత ఇద్దరం అక్కడికి కొద్ది బ్లాకుల దూరంలో ఉన్న 'పోర్ట్ అథారిటీ బస్ టెర్మినల్' వరకు సామాను మోసుకుంటూ నడిచి బస్సు ఎక్కేం.

'ఎయిర్‌కండిషన్డ్' బస్సు మాత్రం నా కంటికి బ్రహ్మాండంగా కనిపించింది. ఊరు దాటింది. రెండు, మూడు గంటలు నడిచింది తప్పితే ఎక్కడా ఆగలేదు. మా తుని నుంచి కాకినాడ వెళ్ళే బొగ్గు బస్సు అన్నవరం వచ్చేలోగా కనీసం అరడజను సార్లు ఆగేది. కత్తిపూడి జంక్షన్ దగ్గర కాఫీ బ్రేకు అని అరగంట ఆపేసేవారు. అక్కడ జంగిడిలో పోసి గారెలు, వేయించిన వేరుశనక్కాయలు, కొబ్బరుండలు, మొక్కజొన్న పొత్తులు, బటానీలు, ఇలా ఎన్నో అమ్మేవారు. బస్సు దిగితే అక్కడో ముసలమ్మ వేడి వేడిగా పొంగరాలు పోసి అమ్మేది. ఇంకా గోళీక్కాయ సోడాలు, కలర్ సోడాలు, కిళ్ళీలు, సిగరెట్లు. తర్వాత ఇంజను వేడెక్కిపోతున్నాది, నీళ్ళు పొయ్యాలని గొల్లప్రోలు దగ్గర ఉన్న చెరువు దగ్గర మరొకసారి ఆపేసే వాడు. ఇలా ఈ పెత్తనాలన్నీ చేసుకుని తునిలో ఎనిమిది గంటలకి బయలుదేరిన బస్సు కాకినాడ చేరుకునే సరికి పదకొండు అయేది. ఈ మూడు గంటల సేపూ కాలక్షేపానికి కొదువ లేకుండా రాజకియాలమీదో, బెండపూడి యోగి భార్యల మీదో, ముమ్మిడివరం బాలయోగి మహిమల మీదో తీవ్రంగా జరిగే చర్చలతో బస్సంతా ఒకటే గోలగా ఉండేది. ఇక్కడ, ఈ బస్సులో ఇంజను చేసే సన్నని శబ్దం తప్ప అంతా నిశ్శబ్దమే. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుతూ "అబ్బీ, ఈ బస్సు ఎంత జోరుగా వెళుతున్నాదో ఊహించి చెప్పకలవా?" అని నా ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ మా అన్నయ్య అడిగేడు.

ఎప్పుడూ రకరకాలైన చమత్కారపు లెక్కల ప్రశ్నలడిగి మమ్మల్ని చిన్నప్పుడు మహ ఇబ్బంది పెట్టేసేవాడు అన్నయ్య. అలాగే ఇప్పుడు కూడా నన్ను పరీక్ష చేస్తున్నాడనుకొని, "బయట టెలిగ్రాఫు స్తంభాలన్నాలేవు లెక్క కట్టి చెప్పడానికి" అని నేను నసుగుతూ ఉంటే, "అంత హడావిడి అక్కర లేదు, ఊహించి చెప్పు" అన్నాడు. తుని నుండి కాకినాడ వెళ్ళే బస్సు ఎన్నడూ గంటకి ఇరవై మైళ్ళు దాటి నడవడం నేను చూడలేదు. 'థర్టీవన్ డౌన్' పేసంజరు తుని నుండి అనకాపల్లి మధ్యనున్న నలభై మైళ్ళు నడవడానికి సునాయాసంగా రెండు గంటలు తీసుకునేది. మధ్యలో 'మెయిల్ క్రాసింగ్' తగిలిందంటే ముత్యం మూడు గంటలు. అందుకని ఒక 'ఫేక్టర్ అఫ్ సేఫ్టీ' పడేసి నలభై మైళ్ళ జోరుంటుందని ఊహించి చెప్పేను. కాదు డెబ్భయ్ మైళ్ళ వేగంతో వెళుతున్నాదని చెపితే నేను నమ్మలేక పోయేను.

మర్నాడు ఒక రోజల్లా రాచెష్టర్‌లో గడిపేను. అక్కడ అన్నయ్యతో యూనివర్శిటీకి వెళ్ళేను. దారిలో వార్తాపత్రిక కొనడానికి ఆగేడు. పేపర్లు అన్నీ ఒక దొంతిలా ఉన్నాయి. పక్కనే మూత లేని సీనారేకు డబ్బాలాంటిది ఒకటి ఉంది. అందులో ఒక 'డైమ్' పడేసి, న్యూస్‌పేపరుతో పాటు చిల్లర 'నికెల్' ఒకటి తీసుకున్నాడు. నేను ఉండబట్టలేక "అన్నయ్యా, ఎవ్వరైనా అందులో ఉన్న చిల్లర అంతా తీసేసుకుంటేనో?" అని అడిగేను. "అలా ఎవ్వరూ తీసుకోరు, ఈ దేశంలో నిజాయతీ ఎక్కువ" అన్నాడు. ఇప్పుడో? మా ఊళ్ళో 'న్యూస్‌పేపరు' 'వెండింగ్ మెషీన్'లో కొనుక్కుంటాం. అందులో పేపర్లు ఎవ్వరూ ఎత్తుకుపోకుండా పెట్టెకి ఒక మూత, దానికి ఒక కప్పతాళం, ఆ పెట్టె పళంగా ఎవ్వరూ పట్టుకు పోకుండా దాని చుట్టూ ఒక మోకు లాంటి గొలుసు, ఆ

గొలుసుని స్తంభానికి చుట్టబెట్టి మరొక కప్పుతాళం. ఒక్క తరంలో కృతయుగం నుండి కలియుగానికి ప్రయాణం చేసేను.

సాయంకాలం అవగానే అన్నయ్య నన్ను మరో బస్సు ఎక్కించేడు. ''తెల్లారేసరికల్లా డిట్రాయిట్ చేరుకుంటావు. ఎంత దారి తప్పినా పొద్దుకూకే లోగా యూనివర్శిటీ చేరుకుంటావు'' అని ధైర్యం చెప్పి, జేబులో మరో పది డాలర్లు పెట్టి నన్ను బస్సులో కూచోబెట్టేడు. తెల్లారేసరికల్లా డిట్రాయిట్ బస్సు స్టేండులో దిగేను. బస్సు స్టేండు దాటి బిక్కుబిక్కు మనుకుంటూ బయటకి వచ్చేసరికి ఎక్కడ చూసినా కార్లు. ఒకటి కాదు, రెండు కాదు, అదొక కార్ల ప్రవాహం. టేక్సీలో యూనివర్శిటీకి వెళ్ళి జేబులో ఉన్న డబ్బులు నాలుగూ తగలేసుకోవద్దని, సిటీ బస్సులో వెళ్ళమని అన్నయ్య మరీ మరీ చెప్పేడు కదా. ఆ సిటీ బస్సు ఎక్కడం ఎలాగో కనుక్కొని ఎక్కిన వైనం అంతా చెప్పేనంటే అదొక ఉపాఖ్యానం అవుతుంది కనుక, గ్రంథవిస్తరణ భీతి వల్ల ఇక్కడ చెప్పను. కాని సిటీ బస్సుని పట్టుకుని ఎక్కడం మాత్రం ఎక్కేను.

మనం మాట్లాడే ఇంగ్లీషు వీళ్ళకి అర్థం కావటం లేదని ముందు విమానంలోనూ, తర్వాత రాచెస్టర్‌లో ఉన్న ఒక్క రోజులోనూ గ్రహించేసేనేమో, నేను వెళ్ళవలసిన యూనివర్శిటీ పేరు ఒక కాగితం మీద ముందే రాసి పెట్టుకున్నాను. అది బస్సు డ్రైవరుకి చూపించి, నా 'బస్ స్టాప్' ఎక్కడ దాటిపోతానో అని నిట్ట నిలువునా బెంగపెట్టేసుకుని బిక్కచచ్చిన ముఖంతో ఆ డ్రైవరుకి ఎదురుగా ఆడవాళ్ళకోసం కేటాయించిన చోటులో నా సూటుకేసుని గాఠ్ఠిగా పట్టుకుని కూర్చున్నాను.

ప్రాణం కొంచెం కుదుట పడ్డ తర్వాత చుట్టూ చూద్దును కదా – ఆ బస్సులో నేనొక్కడినే తెల్లవాడిని; మిగిలిన వాళ్ళంతా –డ్రైవరుతో సహా – అంతా నల్లవాళ్ళే! ఒక గంట సేపు అలా దారి పొడుక్కీ ''నా సంగతి మరిచి పోకేం'' అంటూ డ్రైవరుకి నా ఉనికిని గుర్తు చేస్తూనే ఉన్నాను. ఇంతలో మూలుగుతూ ఉన్న నక్క మీద తాటిపండు పడ్డట్టు నా డ్రైవరు 'షిఫ్ట్' అయిపోయిందిట, దిగిపోయి మరొక డ్రైవరు వచ్చేడు. నా కథ మళ్ళా మొదటికి వచ్చేసరికి ఈ కొత్త డ్రైవరుని మళ్ళా మచ్చిక చేసుకుని నెమ్మదిగా నేను దిగవలసిన చోట తోలుపెట్టెతో సహా దిగేను. వేళ ఏ పదకొండో అయింది.

దిగడం అంటే దిగేను కానీ, ఆ తర్వాత ఏమి చెయ్యడమో బోధ పడలేదు. తలని తరిగేసిన కోడి పుంజులా ఆ కేంపస్‌లో తిరుగుతున్నాను. నడుస్తూన్న కొద్దీ పెట్టె బరువెక్కుతున్నాది. 'దీంట్లో దయ్యం కాని లేదు కదా' అనుకుంటూ చెయ్యగలిగేది మరొకటి లేదు కనుక, ఒగుర్చుకుంటూ, చేతులు మార్చుకుంటూ ప్రాంగణంలో తిరగడం మొదలు పెట్టేను. నక్కని తొక్కొచ్చేనో ఏమో ఇంతలో ఆపద్బాంధవుడిలా ఎదురుగా ఒక భారతీయుడు కనిపించేడు. ఆ రోజుల్లో మన దేశపు వాళ్ళు కనిపిస్తే ముఖం పక్కకి తిప్పేసుకుని వెళ్ళిపోకుండా పలకరించే వారు. అతనూ పలకరించేడు. పేరేమిటన్నాడు. చెప్పేను. ''తెలుగువాడివి అన్న మాట'' అన్నాడు తెలుగులో! ఇలాంటి పరిస్థితులలోనే కృష్ణదేవరాయలు 'దేశభాషలందు తెలుగు లెస్స' అనుంటాడు. 'టెలుగూ ఈజ్ ఎ స్వీట్ లేంగ్వేజ్' అని అందరూ అంటూ ఉంటే వినడమే తప్ప అది ఎంత స్వీటో అప్పుడు అర్థం అయింది.

''ఏదీ, ఆ పెట్టె నా చేతికి ఇయ్యి'' అంటూ పెట్టెని నా చేతులోంచి తీసుకుని నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళేడు. రామినేని అచ్యుతరావు చదువుకుందికని ఆరు నెలల ముందే భార్య లక్ష్మితో వచ్చేడుట. యూనివర్శిటీకి

దగ్గరగానే ఒక చిన్న అద్దె ఇంట్లో ఉండేవాడు. ఇంటికెళ్ళ గానే లక్ష్మి కూడా ఎంతో ఆప్యాయంగా పలకరించి తనకి చేతనైన విధంగా వాళ్ళిద్దరి కోసం వండుకున్నది నాకూ ఇంత పంచి పెట్టింది.

నాకు నెలకి వచ్చే 200 డాలర్ల 'అసిస్టెంట్‌షిప్' లో ముప్ఫయ్ డాలర్లు అద్దె కట్టగా, ఎంత ఖర్చు పెట్టినా స్వయంపాకపు తిండికి నెలకి ఇరవై డాలర్లు మించి అయేది కాదు. పన్నులు పోను మిగిలిన దాంట్లో నెలకి ఏభై డాలర్లు (అంటే 225 రూపాయలు) నాన్నగారికి పంపించి, మిగిలిన డబ్బులు వానాకాలపు రోజుకి దాచుకునేవాడిని. బయటకి వెళ్ళి తినడానికి భయం. 'కొరియా వాళ్ళు కుక్కలని అమెరికా వాళ్ళు ఆవులని' అని విన్నాను కాని ఇక్కడ ఎక్కడ చూసినా 'హాట్‌డాగ్' అనే కనిపించేది. వీళ్ళు కూడ కుక్కలని కాల్చుకుని తింటారేమోనని ఒక అనుమానం. అందుకని 'రెష్టరాంట్' లోపలికి వెళ్ళడానికి భయం. స్వయం పాకానికి 'మూడు' కుదరకపోతే అచ్యుతరావు ఇంటికి దారేదీ అనుకుంటూ వెళ్ళేవాడిని.

అప్పట్లో మన వంట వస్తువులేవీ దొరికేవి కావు. బటానీపప్పునే ఉడకబెట్టుకుని పప్పు, సాంబారు చేసుకునేవారు. లేకపోతే లెంటిల్స్‌తో ఉలవ చారు. పులుపులో చింతపండుకి బదులు నిమ్మకాయలో, క్రీమ్ అఫ్ టార్‌టారో వాడడానికి మనస్కరించని వాళ్ళు న్యూయార్క్ నుండి పోస్టులో పచారీలు తెప్పించుకునేవారు – 'బెజ్జియన్స్' అనే లెబనాన్ దేశీయుడి కొట్టు నుండి. మెంతులు, జీలకర్ర, ఇంగువ మొదలైన వాటి ఇంగ్లీషు పేర్లు తెలిసి చచ్చేవి కాదు.

నేను ఉన్న ఇంట్లోనే మరొక గదిలో గిరిష్ షా ఉండేవాడు. వాడు 'పొటేటో చిప్స్' తిని బతికేవాడు. వాడు బొంబాయి వంటి మహానగరాలలో తిరిగొచ్చేడో ఏమో వారాంతంలో బీర్ తాగడానికి బార్‌కి వెళ్ళేవాడు. వాడిని బతిమాలుకొని నేనూ ఒక సారి వాడితో బార్‌కి వెళ్ళి, ఎవరైనా చూస్తారేమోనన్న భయం లేకుండా, బీరుని తాగి చూసేను. తలంటి పోసుకున్నప్పుడు కుంకుడు రసం బుర్ర మీద నుంచి నోట్లోకి జారినప్పుడు ఎలా ఉండేదో ఆ రుచిలో ఉందా బీరు.

నేను డిట్రాయిట్‌లో ఉన్న రోజులలోనే 'క్యూబన్ మిసల్ క్రైసిస్'. మర్నాడు ఫిజిక్స్ పరీక్ష. ఇంటికొచ్చేసరికల్లా టెలివిజన్ మీద కెన్నడీ మట్లాడుతున్నాడు. మళ్ళా మర్నాడు సూర్యోదయం చూస్తామని మేమెవ్వరం అనుకోలేదు. ఇంక పరీక్షకి ఏమి చదువుతాను? ఈ గండం గడిచిందో లేదో చైనా మెక్‌మేన్ గీతని దాటి భారతదేశంలో చొరబడింది. డిట్రాయిట్ చుట్టుపట్ల ఉన్న భారతీయులమంతా కలసి  డబ్బు పోగుచేసి ఇండియా పంపుదామనే సదుద్దేశంతో ఒక నాటకం వేసేం. హిందీ నాటకం. ఐదువేల డాలర్లు పోగుచేసేం. ఉన్న వాళ్ళే తక్కువేమో, నాకు ఆ నాటకంలో ఒక పాత్ర ఇచ్చేరు. నాకు హిందీ రాదన్నాను. పరవా లేదన్నారు. నాకు ఒక ద్వారపాలకుడి పాత్ర ఇచ్చేరు. ఈటె పట్టుకుని గంటసేపు మాట్లాడకుండా నిలబడ్డాను – మన దేశం కోసం! ఇదీ నేను వేసిన మొదటి వేషం.

మా యూనివర్సిటీలో ఒక పాతిక మంది, వేన్‌స్టేట్ యూనివర్సిటీలో ఒక ముప్ఫయ్ మంది భారతీయులు ఉండేవారేమో. ఈ రోజుల్లోలా తెలుగువాళ్ళు కో అంటే కోటి మంది కనిపించేవారు కాదు; నూటికో కోటికో ఒకడు కనిపించేవాడు. నేను ఉన్న ఊళ్ళో అచ్యుతరావు, నేను ఇద్దరమే తెలుగు వాళ్ళం, మొదట్లో. గుజరాతీలు ఎక్కువగా ఉండేవారు.

ఆ రోజుల్లో 'హోమ్‌సిక్‌నెస్' ఎక్కువగా ఉండేది. పోనీ ఇంటికి ఫోను చేసి మాట్లాడదామా అంటే తునిలో పోష్టాఫీసులో ఒక ఫోను, పోలసానపల్లి గంగరాజు మందుల కొట్లో మరొక ఫోను ఉండేవి. అమ్మ ఇల్లు దాటి ఫోనులో మాట్లాడడానికి ఎలా వస్తుంది? అందుకని మరొక ఉపాయం కనిపెట్టేం. అప్పట్లో 'కోయిన్ ఆపరేటెడ్ ఫొటో బూత్'లు, 'రికార్డింగ్ బూత్'లు ఉండేవి. ఒక క్వార్టర్ వేస్తే మూడు ఫొటోలు 'ఆటోమేటిక్'గా వచ్చేవి. అలాగే రెండు పావలాలకి ఐదు నిమిషాలు ఏదైనా 'రికార్డ్' చేసుకోవచ్చు. అమ్మకి ఉత్తరం రాసి, ఆ ఉత్తరాన్ని ఆ 'బూత్' దగ్గరకి పట్టుకెళ్ళి, ఐదు నిమిషాలలో గబగబ చదివేసిన తర్వాత ఒక మీట నొక్కితే చిన్న గ్రామఫోను రికార్డు ఒకటి బయటకి వచ్చేది. దానిని ఇంటికి పోస్టులో పంపితే అది వేసుకుని కనీసం మమ్మల్ని చూడలేకపోయినా మా గొంతుక అమ్మ వింటుందని మా ఆశ. వచ్చిన చిక్కల్లా ఇంట్లో గ్రామఫోను లేదుగా.

'హోమ్‌సిక్‌నెస్' అంటే తల్లిదండ్రుల కోసం బెంగ పెట్టుకోవడం ఒక్కటే కాదు. అంతకంటె వర్ణించడానికి అందని ఒక వేదన. అకస్మాత్తుగా ఇల్లు జ్ఞాపకం వచ్చి ఒక రోజున – మరే కారణం లేకుండా – తలగడలో తల దూర్చి వెక్కి వెక్కి ఏడ్చేసేను. గదిలోకి వచ్చిన గిరిష్ షా సముదాయింపుగా పక్కన కూర్చుని 'ఏదో ఒకటి మాట్లాడు, వింటాను' అన్నాడు. వాడితో గంట సేపు తెలుగులో మాట్లాడేసేను. అప్పుడు ఆకళింపుకి వచ్చింది – వాడికి తెలుగు రాదని. అది హోమ్‌సిక్‌నెస్ అంటే.

ఈ విషయం తెలిసి రాచెస్టర్‌లో ఉన్న మా అన్నయ్య చిర్రా రామలింగారెడ్డి కారులో నా దగ్గరకి వచ్చి ఒక రోజు గడిపి వెళ్ళేడు. "మేష్టారూ, మీరెప్పుడూ 'టై' కట్టుకుని, బాగా డ్రెస్ చేసుకోవాలి. లేకపోతే వీళ్ళకి మన స్టేటస్ తెలియదు" అంటూ రెడ్డి నాకొక సలహా పారేసేడు. ఈ రెడ్డి ఫొటోనే 'ఏపిల్' కంపెనీ వాళ్ళు దరిమిలా వారి ప్రకటనలలో కొన్ని సంవత్సరాలు వాడుకున్నారు.

హోమ్‌సిక్‌నెస్ భరించ లేక మరొక తెలుగు కుటుంబం కోసం ఏ ఏన్‌ఆర్బరో, లేన్సింగో, టొలీడోవో వెళ్ళే వాళ్ళం. అక్కడ తెలుగు వాళ్ళు ఎవరు ఉంటే వారింటికి వారం చెప్పుకుని వెళ్ళిపోవడమే. ఇలా వారాలు చెప్పుకు తిరిగే రోజులలో ఈస్ట్ లేన్సింగ్‌లో తుమ్మల మాధవరావు పరిచయం అయేరు. ఈ మాధవరావే డిట్రాయిట్‌లో రెండవ తానా సమావేశానికి కన్వీనరు. వాళ్లొక సూవనీరు ప్రచురించేరు. దానికి శ్రీమతి చెరుకూరి రమాదేవి సంపాదకురాలు.

ఈ చెరుకూరి రమాదేవిగారిని 1963 లో ఇల్లినాయ్‌లో కలుసుకున్నాను, మొదటిసారి. చెరుకూరి రామారావు గారు నాకు దూరపు బంధువట. నాకు ఎలా బంధువో వివరిస్తూ, నేను 'హోమ్‌సిక్' అవుతానని నామీద జాలిపడి వాళ్ళింటికి వచ్చి కొన్నాళ్ళు ఉండమని ఆయన డిట్రాయిట్‌లో ఉన్న నాకు ఒక ఉత్తరం రాసేరు. ఆయన ఎవరో అప్పటికి తెలియక పోయినా పిలవని వాడిది పొరపాటనుకుంటూ వేసంగిలో వారింటికి వెళ్ళి ఒక వారం రోజులు ఉన్నాను. అప్పుడే తెలిసింది రమాదేవి 'బాంధవ్య బంధింతులు' అనే నవల రాసి, పోటీలో ప్రథమ బహుమతి పొందారని.

డిగ్రీ పని అయిన తర్వాత అనుభవం సంపాదించడానికిగాను పద్దెనిమిది నెలల పాటు వీసా ఇచ్చేవారు. నాలుగు రాళ్ళు వెనకేసుకుని రెండేళ్ళల్లో ఇండియా తిరిగి వెళ్ళిపోదామనే సదుద్దేశం ఉన్న నాలాంటి వాళ్ళకి ఇదే మంచి అవకాశం కనుక నేను ఇండియనాపొలిస్‌లో ఉన్న ఆర్.సీ.ఏ. లో ఉద్యోగం వస్తే చేరేను. నెలకి ఏడు వందలో ఎనిమిది వందలో ఇచ్చేవారు. నేనక్కడ ఉన్న ఒక్క ఏటిలో జవహర్లాల్ నెహ్రూ, జాన్ కెన్నడీ,

మేరిలిన్ మన్రో – ముగ్గురూ చచ్చిపోయారు. ఆ రోజుల్లోనే జాక్ పార్ రిటైరై అతని స్థానంలో జానీ కార్సన్ వచ్చేడు. జాక్ పార్‌కి అలవాటు పడ్డవాళ్ళు జానీ కార్సన్‌ని నచ్చుకోరేమోనని అందరూ భయపడేవారు.

ఉద్యోగం వెలగబెట్టడం మొదలు పెట్టిన తర్వాత చేతిలో డబ్బులు ఆడుతూ ఉంటే రెండువేల డాలర్లు పెట్టి 'ఫోక్స్‌వేగన్ బీటిల్' ఒకటి కొన్నాను. గేలను గేసు పదిహేను పైసలు. న్యూయార్క్‌లో 'వరల్డ్ ఫెయిర్' చూడ్డానికి వెళ్ళినప్పుడు పెట్రోలు ఖర్చు పట్టుమని పది కూడ కాలేదు. 'సర్వీస్ స్టేషన్' లోకి కారు వెళ్ళేసరికల్లా లోపల టింగుమని ఒక గంట కొట్టేది. ఆ గంటకి ముగ్గురు కుర్రాళ్ళు పరిగెత్తుకుని బయటకి వచ్చి ఒకడు 'విండ్‌షీల్డ్', చుట్టూ ఉన్న అద్దాల తలుపులు చకచకా తుడిచేవాడు. మరొకడు టైర్లలో గాలి సరిగ్గా ఉందో లేదో చూసే వాడు. మూడో వాడు 'ఆయిల్' తనిఖీ చేసే వాడు. ఇప్పటి సంగతి చెప్పి కాగితం, సిరా వృధా చెయ్యడం ఎందుకు?

ఆ ఏడు గడచిన తర్వాత పి.హెచ్.డి. చెయ్యాలనే కోరికతో ఉద్యోగం వదిలేసి – గంటకి రెండు డాలర్ల నలభై పైసల జీతం మీద – యు.సి.ఎల్.ఎ. లో చదువుదామని లాస్ ఏంజిలిస్‌కి ప్రయాణం కట్టేను. 'ఇంటర్‌స్టేట్' 4( అప్పటికి ఇంకా పూర్తి కాలేదు. 'రూట్ 66' అని ఒకటి ఉండేది. దానికి ఇట్నుంచి వెళ్ళడానికి ఒక 'లేను', అట్నుంచి రావడానికి ఒక 'లేను'. మధ్యలో మైదానంలా జాగా ఉండేది కాదు. ఎదురుగా 'ట్రక్' వచ్చినప్పుడల్లా ఈదర గాలిలో కోడి వెంట్రుకలా నా 'బీటిల్' ఇటూ, అటూ ఊగిసలాడి పోయేది. ముందున్న వాడు 'స్లో పోక్' అయితే శవాన్ని స్మశానానికి తీసుకెళుతూన్న ఊరేగింపులా ఒక కార్ల చయనిక తయారయేది. దారి పొడుక్కీ ఊర్లు తగులుతూ ఉండేవి. ఊరొచ్చినప్పుడల్లా ఈ చయనిక కబంద హస్తాలని వదిలించుకుని, ఎదటి కారుని దాటి, ముందుకి వెళ్ళడానికి అవకాశం దొరికేది.

జాక్సన్ సిటీ, మిస్సోరి లో మొదటి రాత్రి మకాం. రోజల్లా డ్రైవ్ చేసి అలసి పోయానేమో బీరు తాగుదామని (గిరిష్ షా గాడు నేర్పేడు కదా!) హోటేల్‌లో ఉన్న బార్‌కి వెళ్ళేను. ఆ బార్‌లో నా పక్కన కూర్చున్న వ్యక్తికి ఇండియా నుంచి వచ్చిన వాళ్ళని చూడ్డం అదే మొదటి సారిట. నన్ను చూసి చాల సరదా పడిపోయేడు. మర్నాడు తనతో వారింటికి రమ్మనమని చాల బలవంతం చేసేడు. వాళ్ళ అబ్బాయికి, భార్యకి నన్ను చూపించడానికిట. వాళ్ళ ఊరు అక్కడకి 200 మైళ్ళు ఉంటుందన్నాడు. ముక్కూ, ముఖమూ తెలియని వారింటికి వెళ్ళడం ఇష్టం లేక 'అలా పక్క తిరుగుళ్ళు తిరగడానికి నాకు వేళా లేదు, అలా ఖర్చుపెట్టడానికి నా దగ్గర అంత డబ్బూ లేదు' అన్నాను. వినలేదు. 'ఎందుకు నా మీద అంత శ్రద్ధ చూపిస్తున్నావు' అని అడిగేను. అప్పుడు చెప్పేడు. తన కొడుకుని కాలేజీకి వెళ్ళి చదవమని తను శతవిధాల పోరినా ఫుట్‌బాల్ ఆట మీద ఉన్న శ్రద్ధ చదువు మీద చూపించడం లేదుట. నేను చెబితే వింటాడేమోనని ఆశ పడుతున్నాడుట. ఇహ వెళ్ళక తప్పింది కాదు. వెళ్ళేను. చిన్న పల్లెటూరు. వెళ్ళి వారింట రెండు రోజులు ఉన్నాను. తిరిగి బయలు దేరుతూ ఉంటే 'నా దగ్గర అంత డబ్బూ లేదు' అన్న మాట జ్ఞాపకం పెట్టుకున్నాడు కాబోలు, నా చేతిలో పన్నెండు డాలర్లు పెట్టి, 'కనీసం గేసు ఖర్చులకుంటాయి తీసుకో' అన్నాడు. నేను అమెరికాలో ఉన్న నలభై ఏళ్ళల్లోనూ మరపురాని సంఘటనలలో ఇది ఒకటి.

పక్కదారి నుండి మళ్ళా రూట్ 66 లో పడ్డాను. దారి వెంబడే 'బర్మా షేవ్ కమర్షియల్స్' కనిపించేవి. ఇవి మన వేమన పద్యాలనీ, హైకూలనీ కలిపికొట్టిన పద్యాలలా ఉండేవి. మైలు కొొక పాదం చొప్పున బోర్డుల మీద

రాసేవారు. మొదటి మూడు పాదాలూ చదివే సరికి మిగిలిన పాదాలు ఎలా ఉంటాయోనని మనకి కుతూహలం పుట్టేది. మచ్చుకి నాకు జ్ఞాపకం ఉన్న 'పద్యం' ఒకటి చెబుతాను. "ఇఫ్ హర్గ్గింగ్ | ఆన్ హైవేస్ | ఈజ్ యువర్ స్పోర్ట్ | ట్రేడిన్ యువర్ కార్ | ఫర్ ఎ డేవెన్‌పోర్ట్ | బర్మా షేవ్ |. డ్రైవ్ చేస్తూన్నప్పుడు విసుగు పుట్టకుండా ఈ బర్మాషేవ్ పద్యాలు చాల బాగ ఉపయోగపడేవి తప్ప ఈ 'కమర్షియల్స్' వల్ల ఆ 'షేవింగ్ క్రీమ్' అమ్మకాలు పెరగలేదని దరిమిలా విన్నాను.

నేను లాస్ ఏంజిలిస్ లో చదువుకుంటూన్న రోజులలోనే వియత్‌నామ్ యుద్ధం జోరు బాగా పుంజుకుంది. వయస్సులో ఉన్న మగ పిల్లలంతా విధిగా సైన్యంలో పనిచేయాలనే నిబంధన ఒకటి ఉండేది. ఈ నిబంధన నుండి తప్పించుకుందికి అమెరికన్ విద్యార్థులు గ్రేడ్యుయేట్ స్కూల్లో చేరేవారు. భారతీయులు కొంతమంది అమెరికా వదలి కెనడా వలస వెళ్ళిపోయారు. దేశం చాల కల్లోలంగా ఉండేది. ఆ రోజులలోనే మార్టిన్ లూథర్ కింగ్‌నీ, రాబర్ట్ కెన్నడీని చంపేశారు.

నేను యు.సి.ల్.ఏ. లో చేరినప్పుడు లాస్ ఏంజిలిస్ ప్రాంతాలలో ముప్ఫయ్ మంది తెలుగు వారు ఉండేవారేమో! పి.హెచ్.డి. పట్టా పుచ్చుకునేనాటికి ఈ జనాభా ఎంత పెరిగినా అరవైకి మించి ఉండదని నా అంచనా. ఆ రోజులలోనే ప్రెసిడెంట్ జాన్సన్ ఇమ్మిగ్రేషన్ నిబంధనలు సడలించడం జరిగింది. 'ఔటాఫ్ స్టేట్' జీతం కట్టలేక ఇబ్బంది పడతున్నానని నా ప్రొఫెసర్ నన్ను 'ఇమ్మిగ్రెంటు వీసా'కి దరఖాస్తు పడెయ్యమన్నారు. కొత్త తరం భారతీయులు వెల్లువలా అమెరికా వలస రావడం ఈ రోజులలోనే ప్రారంభమయింది. ఈ రోజులలోనే నేను వివాహం చేసుకోవడం కూడ జరిగింది.

ఆ రోజులలో పెళ్ళయిన వాళ్ళు బ్రహ్మచారి విద్యార్థులని తరచుగా భోజనానికి పిలవడం రివాజుగా ఉండేది. అందుకని మా యింటికి కొంతమంది తెలుగు విద్యార్థులు భోజనానికి వచ్చేరు. తిన్న తిండి అరిగే వరకూనో, గొంతుక నెప్పి పెట్టే వరకూనో వాదించుకోవడం కూడ ఆ రోజులలో రివాజుగా జరిగేది. 'తెలుగు భాష ఎందుకూ పనికి రాదు. సైన్సు అవసరాలకి అస్సలు పనికిరాదు' అని ఆనాటి వాగ్వాదపు సారాంశం. వాదనతో వేడి పుట్టింది కాని వెలుతురు రాలేదు. వేడి చల్లారిన తర్వాత ఒక రోజు కూర్చుని కంప్యూటర్లు ఎలా పనిచేస్తాయో ఒక చిన్న వ్యాసం తెలుగులో రాసి చూద్దామని ప్రయత్నించేను. అది పదిహేను రోజులలో పూర్తి అయేసరికి 200 పేజీలు అయింది. 'దీనిని ఎవరు చదువుతారులే' అనుకుంటూ ఆ కాగితాల దొంతిని కట్టకట్టి 'క్లాజెట్' లో పడేసి నా 'థీసిస్' పనిలో పడి దాని విషయమే మరచి పోయాను.

ఈ లోగా ఒక రోజున సర్వశ్రీ పెమ్మరాజు వేణుగోపాలరావు, గవరసాన సత్యనారాయణ, రావిపూడి సుబ్బారావు ప్రభృతుల దగ్గర నుండి ఒక లేఖ వచ్చింది. వారు తెలుగుభాషాపత్రిక అనే పేరున ఒక విజ్ఞాన పత్రిక స్థాపిస్తున్నారట. సైన్సు విషయాల మీద ఏదైనా రెండు పేజీల వ్యాసం తెలుగులో రాసి పంపించమని ఆ లేఖ సారాంశం. 'ఈ పిచ్చోళ్ళకి కూడా నాకు పట్టిన పిచ్చే పట్టిందే' అనుకుంటూ ధూళిని సేకరిస్తూన్న నా 200 పేజీలకి ఒక జిరాక్స్ కాపీ తీసి వారికి పంపించేను. వారు దానిని మూడేళ్ళ పాటు ఒక సీరియల్‌గా ప్రచురించుకున్నారు. చదివిన వాళ్ళు నా వెనక ఏమనుకున్నారో నాకు తెలియదు కాని ఎదట మాత్రం బాగుందన్నారు. వెర్రిబాగులవాణ్ణి కనుక నిజమే అనుకున్నాను.

తర్వాత మరొక నాలుగేళ్ళు అసిస్టెంటు ప్రొఫెసర్‌గా టెన్యూర్ కోసం అజ్ఞాత వాసం. ఆ రోజులలోనే సైన్సు ప్రాతిపదికగా చిన్న చిన్న కథానికలు, జీవరహస్యం అనే పుస్తకం రాసేను. ఇలా ఏమి రాసినా అవి ఇండియాలో ఏ పత్రిక వారో ప్రచురిస్తారనే ఆశతోటే. ఈ దేశంలో మనకి 'ఔట్‌లెట్' లేదుగా. ఇండియాలో ఎవ్వరైనా ప్రచురించినా, 'మీరు అమెరికాలో ఉన్నారు కనుక ప్రచురించేరు' అని అనే వారు కొందరు 'స్నేహితులు.'

ఈ సందర్భంలోనే పూర్వపు పరిచయాన్ని పురస్కరించుకొని, ''వెంకటేశ్వరరావు గారూ, మీరేదైనా రాసి ఇవ్వండి మా సూవనీర్‌లో వేసుకుంటాం'' అని రమాదేవి గారు అడిగేరు. నేను ఎదురు చూస్తున్న 'ఔట్‌లెట్' దొరికింది కదా అని నాకు ప్రీతి పాత్రమైన వైజ్ఞానిక వ్యాసం రాస్తానన్నాను. కాదు, సాహిత్యం మీద రాయమన్నారు. అప్పుడు 'కవితాలోకంలో కోపం' అని ఒక వ్యాసం గొలికి ఇవ్వడం జరిగింది. ఇదే తానా వారికి నేను రాసిచ్చిన మొదటి రచన.

అప్పట్లో తానా సమావేశాలు ఎక్కడ జరిగినా కన్వీనరు గారో, వారి కుడి భుజం అయిన వ్యక్తో స్వయంగా పిలచి రమ్మని ఆహ్వానించేవారు. మరీ మరీ రమ్మని పిలచేవారు. బసకి ఏర్పాట్లు చేసేవారు. భోజనాలన్నీ ఇళ్ళల్లో ఆడవాళ్ళు వండి వడ్డించేవారు. మూడవ తానా సమావేశం చికాగోలో జరిగే వేళకి తానాకి కొంత 'పొలిటికల్ స్టేటస్' వచ్చేసింది. తానా 'కన్వీనర్' పదవికి చాల ఆకర్షణ వచ్చేసింది. తానా పదవులలో ఉన్న వారి పిల్లలకి ఆంధ్రాలో మెడికల్ కాలేజీ సీట్లు రావడం తథ్యం అనే నమ్మకం ఏర్పడిపోయింది. కొట్టుకోడానికి ఏమీ లేనప్పుడే కొట్టుకు చచ్చే స్వభావం మనది. అలాంటిది పదవితో పాటు పరపతి కూడా వస్తోందన్నప్పుడు ఎలా ఊరుకోగలం? భేదాభిప్రాయాలు వచ్చినప్పుడు వాటిని కులతత్వాల ముసుగులో పెట్టి, వాటికి తెలుగు దేశపు రాజకీయాల మసాలా తగిలించేసరికి కొద్ది కొద్దిగా స్పర్ధలు, చీలికలు మొదలయాయి. లాస్ ఏంజలిస్‌లో ఐదవ తానా జరిగిన తర్వాత రోజులలో ఈ చీలికలు ఇంతింతై, ఎంతో పెద్దవై, అగాథాలై 'ఆటా' సంస్థాపనకి మూలకారణం అయాయి.

లాస్ ఏంజలిస్‌లో ఐదవ తానా సమావేశం సందర్భంలో విడుదల అయిన జ్ఞాపికకి ఏ ముహూర్తాన సంపాదకత్వం వహించేనో కాని, అదే నాలో ఆనందం కలిగించిన ఆఖరు తెలుగు సమావేశం. ఆ తర్వాత క్రమేపీ తానా, ఆటా సభల యెడల నాకు ఉదాసీనత ఏర్పడింది. సభలు మరీ పెద్దవి కావడం ఒక కారణం. కుల తత్వాలతో చెలరేగిన స్పందనలు మరొక కారణం. కాలం మారిపోయింది. తరాలు మారిపోతున్నాయి. తానా, ఆటాలతో పాటు తెలుగు సాహితీ సదస్సు అని మరొక సంఘం మొదలైంది. ప్రాంతీయంగా కూడ 'సిలికాన్ ఆంధ్రా' వంటి సంఘాలు నూజెర్సీ, డెలవేర్, టెక్సస్, ఇల్లినాయ్ మొదలైన రాష్ట్రాలలో వెలిసేయి. ఇలా ఎవరికి తోచిన విధంగా వారు 'కళాపోసన' చేస్తున్నారు. అదీ ముదావహమైన విషయం!